క్లుప్తంగా

ఘనంగా గాయత్రీ దీపయజ్ఞం



దీపయజ్ఞం నిర్వహిస్తున్న గాయత్రీ పరివార్ ప్రతినిధులు

ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో అఖిల విశ్వ గాయత్రీ పరివార్ కేంద్ర శాంతికుంజ్ హరిద్వార్ ప్రతినిధులు శుక్రవారం గాయత్రీ దీపయజ్ఞం నిర్వహించారు. పరివార్ ప్రతినిధి సతీష్‌ఖండేల్‌వాల్ మాట్లాడుతూ.. గాయత్రీ మంత్రం మహామంత్రమని, ఇది జ్ఞాపకశక్తిని పెంపొందిరచడంతోపాటు చదువులో రాణించేందుకు ఉపకరిస్తుందని విద్యార్థులకు సూచించారు. పుట్టినరోజున కొవ్వొత్తులు ఆర్పి కాకుండా దీపాలు వెలిగించి జీవితాల్లో జ్యోతిని నింపాలని కోరారు.

రగ్గుల పంపిణీ

పాల్వంచ: లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డ్ పాల్వంచ ఆధ్వర్యంలో రగ్గులు పంపిణీ చేశారు. శుక్రవారం కారేగట్టు పంచాయతీ సారేకల్లు గిరిజన గ్రామానికి చెందిన 27 కుటుంబాలకు క్లబ్ అధ్యక్షుడు పాత్రు సతీష్ ఆధ్వర్యంలో రగ్గులు అందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఆరుద్ర సత్యనారాయణ, కత్తి శ్రీనివాసరావు, పాకాలపాటి రోశయ్య చౌదరి, సోయం సత్యనారాయణ, శెట్టిపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టీజీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడిగా రవికుమార్



ఇల్లెందురూరల్: తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) జిల్లా అధ్యక్షుడిగా ఇల్లెందు తహసీల్దార్ కోట రవికుమార్ ఎంపికయ్యారు. శుక్రవారం కొత్తగూడెంలో నిర్వహించిన రెవెన్యూ ఉద్యోగుల సమావేశంలో ఈ మేరకు జిల్లా యంత్రాంగం నిర్ణయం తీసుకుంది.

రైతులకు ఏ1 నోటీసులు జారీ

ఇల్లెందురూరల్: సుదిమళ్ల రెవెన్యూ పరిధిలోని రైతులకు రెవెన్యూ అధికారులు శుక్రవారం ఏ1 నోటీసులు జారీ చేశారు. నోటీసులో వివరాలు.. సమీకృత గురుకుల సముదాయం నిర్మాణానికి ప్రభుత్వానికి 20 ఎకరాల భూమి అవసరం ఉందని, దీనికోసం సుదిమళ్ల రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్ 618లో ఉన్న భూమిని కేటాయిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే పదిహేను రోజుల లోపుగా లిఖితపూర్వకంగా తహసీల్‌లో అందజేయాలని సూచించారు. దీంతో ప్రస్తుతం సదరు భూమిలో సాగులో ఉన్న 15 మంది రైతుల ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం విఫలం

ఇల్లెందు: ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయిందని సీపీఎం జిల్లా నాయకుడు కె.శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... హామీల అమలులో ప్రభుత్వం మీద ఒత్తిడి చేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టుల మీద ఉందన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో ఇల్లెందులో జరగనున్న జిల్లా సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఏ నబీ, ఆలేటి కిరణ్, మోహన్‌రావు, కృష్ణ, నాగరాజు, ఖాదర్, అబ్బాస్ తదితరులు ఉన్నారు.

నగదు వితరణ

పాల్వంచ: ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా త్వరలో నిర్వహించనున్న ఉత్సవాల ఖర్చుకు 1976–77 బ్యాచ్‌కు చెందిన యూఎస్ఏ ఎన్ఆర్ఐ జాస్తి నగేష్ కుమార్ రూ.50వేలు అందించారు. శుక్రవారం నగేష్ స్నేహితుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అమరనేని హరి ద్వారా చెక్కును ప్రిన్సిపాల్ శంకర్‌కు అందించారు.

ల్యాప్‌టాప్..

ఇల్లెందు: ఓ పేద విద్యార్థికి చేతన ఫౌండేషన్ ల్యాప్‌టాప్ వితరణగా అందజేసింది. శుక్రవారం ఇల్లెందులో బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు దిండిగల రాజేందర్ చేతుల మీదుగా ఈ ల్యాప్‌టాప్‌ను ఎస్‌బీఐటీలో బీటెక్ చదువుతున్న ఇల్లెందు విద్యార్థి కందాల రితిక్‌కు అందజేశారు. ఎస్.రంగనాథ్, సిలివేరు సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, ఎండీ జాఫర్ హుస్సేన్, అజ్మీరా బావ్‌సింగ్ నాయక్, అబ్దుల్ నబీ, డేరంగుల పోషం, గిన్నారపు రాజేష్ తదితరులు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పాల్వంచ: పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. మండలంలోని దంతలబోర ఎస్సీకాలనీ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో ఎస్ఐ సురేశ్ ఆధ్వర్యంలో దాడి చేసి, ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మరో 9 మంది పరారయ్యారు. రూ.2 వేల నగదు, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

‘గూడెం’లో గొడవలు

రెచ్చిపోతున్న రౌడీషీటర్లు

- వారికి రాజకీయ నేతల అండదండలు
- భయభ్రాంతులకు గురవుతున్న సామాన్యులు



దుర్గనబస్తీలో ఇటీవల గొడవ పడుతున్న యువకులు (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నేరచరిత్ర ఉన్న రౌడీషీటర్ల ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయి. చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో రౌడీషీటర్ల జోక్యం ఉంటోంది. అడ్డుచెప్పే వారిని, సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దీనికి తోడు వారికి వివిధ రాజకీయ పార్టీల అండదండలు ఉండడంతో వారి ఆగడాలు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. పోలీసులు చర్యలు తీసుకునే లోగా పార్టీల నాయకులు పోలీసులకు ఫోన్లు చేసి కేసుల నుంచి తప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో పోలీసులంటే కూడా వారి భయం లేకుండా పోయింది. జిల్లాలో డీఎస్పీలు, సీఐలు బదిలీలు, జాయినింగ్‌లు అయినప్పుడు మాత్రమే రౌడీషీటర్లను స్టేషన్లకు పిలిపించి నామమాత్రంగా కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేస్తున్నారు. తదుపరి వారు బదిలీ అయ్యే వరకు వారిని మందలించకపోవడంతో మరిన్ని నేరాలకు పాల్పడుతూ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రౌడీషీట్ ఉండి, తరుచుగా వివిధ కేసులు అతడిపై నమోదు అయితే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉంటుంది. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో సదరు రౌడీషీటర్లు అక్రమ దందాలలో ప్రధాన సూత్రదారులుగా ఉన్నా వారిపై ఎటువంటి చర్యలు ఉండడం లేదు. రౌడీషీటర్లు ప్రధానంగా డబ్బు అవసరాలున్న వారిని ఆసరాగా చేసుకొని రూ.10 నుంచి రూ.20 వరకు వడ్డీ వ్యాపారం చేస్తున్నారు. భూదందాలు చేస్తూ కమీషన్లు తీసుకుంటున్నారు. ఇదేమి న్యాయం అని అడిగిన వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. అక్రమ రేషన్ బియ్యం, భూదందాలు, అక్రమ ఇసుక, వడ్డీ వ్యాపారం, మట్కా, ఆన్‌లైన్ గేమ్‌లు ఇలా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రౌడీషీటర్లు రోడ్లపై ద్విచక్రవాహనాలపై కూర్చొని అటుగా వచ్చివెళ్లే మహిళలను ఎగతాళి చేయడం, పురుషులను బెదిరించడం చేస్తున్నారు.

పెట్రోలింగ్ నామమాత్రమే..

కొత్తగూడెం జిల్లా కేంద్రంలో రౌడీషీటర్లు, ఆకతాయి యువకులు రెచ్చిపోతున్నారు. ఉచితంగా వచ్చే డబ్బుకు అలవాటు పడి నేరాలకు పాల్పడుతున్నారు. ఇటువంటి సమయంలో పోలీసులు పెట్రోలింగ్‌ను పెంచి ఆకతాయిలకు, నేరచరిత్ర ఉన్న వారికి తగిన బుద్ధిని చెప్పాలని స్థానికులు అంటున్నారు. గతంలో ప్రతీరోజు సాయంత్ర 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పట్టణం, మండల కేంద్రాల్లో పోలీసులు పెట్రోలింగ్ చేసేవారు. ప్రస్తుతం అది లేకపోవడంతో రోడ్లపైనే ఆకతాయిలు, రౌడీషీటర్లు, నేరచరిత్ర ఉన్నవారు గుంపులుగా రోడ్లపై తిష్ఠ వేస్తున్నారు. ఇదేంటి అని అడిగిన వారిపై దాడులకు దిగుతున్నారు. వీరికి రాజకీయ పార్టీల మద్దతు పుష్కలం. దీంతో నేరాలు పెరుతున్నాయి. దీంతో పాటుగా ఇటీవల కాలంలో ఇళ్లలో చోరీలు అధికం అవుతున్నాయి. రైటర్‌బస్తీ గొల్లగూడెం ఏరియా రైల్వే క్వార్టర్స్‌లో గత నెల చోరీ జరిగి ఇంట్లో డబ్బులు, దుస్తులు, బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అదే ఏరియాలోని ఇంకొన్ని క్వార్టర్స్‌లో కూడా చోరీలు జరిగాయి. ఇక్కడ పోలీసులు నిఘాను పెంచాలని బాధితులు వాపోతున్నారు. జిల్లా కేంద్రంలోని హనుమాన్‌బస్తీ, గాజులరాజంబస్తీ, బూడిదగడ్డ, రైతుబజార్ ఏరియా, రామటాకీస్ ఏరియా, మధురబస్తీ, బాబుక్యాంపు, పోస్టాఫీసు ఏరియాలలోని రౌడీషీటర్లు రెచ్చిపోతున్నారు. ఇటీవల కొత్తగూడెం ముర్రేడువాగు బ్రిడ్జి దగ్గర బిర్యాని పాయింట్‌లో యువకులు బిర్యాని తిని డబ్బులు ఇవ్వకుండా యజమానితో గొడవకు దిగి తీవ్రస్థాయిలో కొట్టుకున్నారు. స్థానికులు, రోడ్డుపై వచ్చిపోయేవారు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఇదిఇలా ఉంటే దుర్గనబస్తీలో ఓ యువకుడు బైక్ ఇవ్వనందుకు మరో ఇద్దరు యువకులు కలిసి అతడిని తలపగలకొట్టారు. దీంతో స్థానికులు భయభ్రంతులకు గురవుతున్నారు. ఇటువంటి సంఘటనలు జిల్లా కేంద్రంలో చాలా జరిగిన సంఘటనలు ఉన్నాయి. పోలీసులు మరింత నిఘా పెంచి రౌడీషీటర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం



దైవ సందేశమిస్తున్న బిషప్ ప్రకాష్

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులోని ఆర్‌సీఎం చర్చి (నిర్మల మాతా దేవాలయం) 23వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా ఖమ్మం క్యాథలిక్ బిషప్ సగిలి ప్రకాష్ హాజరయ్యారు. దివ్యబలి పూజ కార్యక్రమాన్ని నిర్వహించి దైవ సందేశం ఇచ్చారు. ప్రజలు కులమతాలకు అతీతంగా శాంతి సామరస్యంతో కలిసి మెలిసి ఉండాలన్నారు. కులాలు మానవుడు సృష్టించుకున్నవని, దేవుని దృష్టిలో అందరూ సమానులేనన్నారు. చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ శౌరీ, జ్వానెస్, శ్రీకాంత్, జయానంద్, ధనరాజ్, తుడుం థామస్, మేదర జయరాజు, కొరివి థామస్, రేమాండ్, ఇమ్మానుయేలు, జోజీ, సెయింట్ ఆంటోనిస్ స్కూల్ సిస్టర్స్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బంద్

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జూలూరుపాడు విద్యుత్‌శాఖ ఏఈ సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్ఐ బదిలీ

జూలూరుపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గిర్దావర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ముత్తమాల తిరుపతిరావు పాల్వంచ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ స్థానంలో ఇల్లెందు తహసీల్‌లో పని చేస్తున్న ఆర్ఐ చీమల ఆదినారాయణ బదిలీపై జూలూరుపాడుకు రానున్నారు.

అండర్ 14 జిల్లా క్రికెట్ జట్టుకు తనిష్క్ ఎంపిక

కొత్తగూడెంరూరల్: అండర్ 14 జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు శనివారం ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగాయి. కొత్తగూడేనికి చెందిన శ్రీవిద్య పాఠశాల విద్యార్థి తనిష్క్ ఎంపికయ్యాడు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తనిష్క్‌ను విద్యాసంస్థల అధినేత ఎంపీ చౌదరి అభినందించారు. మాట్లాడుతూ.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే నాకౌట్ టోర్నీకి తనిష్క్ పంపించనున్నట్లు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి..

పాల్వంచ: పాల్వంచ మండలంలోని బంద్రుగొండ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ నాయకులు నిమ్మల రాంబాబు అన్నారు. శుక్రవారం గ్రామంలో స్థానికులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంతకాల సేకరణ చేశారు.

మాట్లాడుతూ.. గ్రామంలో మిషన్ భగీరథ నీరు సరిపడ రాకపోవడం, గ్రామంలో ఉన్న మూడు చేతిబోర్లు పనిచేయక పోవడం వల్ల గ్రామస్తులు మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. సమస్య పరిష్కరించకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

సమయపాలన పాటించండి..



మాట్లాడుతున్న ఎంఈఓ జుంకీలాల్

జూలూరుపాడు: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ... పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. ప్రతీరోజూ హెచ్ఎంలు భోజనం నాణ్యత, పరిశుభ్రత పరిశీలించడంతోపాటు, రుచి చూసిన తరువాతే విద్యార్థులకు పెట్టాలన్నారు. యూడైస్ ప్లస్‌లో విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ చేయాలని, అపార్ కార్డులను జనరేట్ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యాంజలి 2.0 పాఠశాల వివరాలు, ప్రత్యేక అవసరాల విద్యార్థుల వివరాలు ప్రశస్త యాప్‌లో నమోదు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన వర్కర్లకు సెప్టెంబర్, అక్టోబర్ జీతాలు జమ అయినట్లు చెప్పారు.

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



మాట్లాడుతున్న భానుచందర్

టేకులపల్లి: సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులు, వర్కర్స్, ఎంఎంఎస్, సీసీఓ, సీఆర్‌పీ, ఐఈఆర్‌పీ, మెసెంజర్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని పీవైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ... సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు పీవైఎల్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని చెప్పారు. ఏళ్ల తరబడి చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు కనీస ఉద్యోగ భద్రత లేకుండా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. చాలా సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీసును సీఎం ఇచ్చిన హామీ మేరకు వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. భూక్యా లక్ష్మణ్, తోటకూరి సతీష్ పాల్గొన్నారు .

ముందస్తు అరెస్టు



పోలీస్ స్టేషన్‌లో ఆర్‌పీలు

పాల్వంచ: మెప్మాలో పనిచేస్తున్న ఆర్‌పీలు హైదరాబాద్‌లో జరగిన ధర్నాకు వెళ్లకుండా ముందస్తుగా పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారిని పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ స్టేషన్‌కు వచ్చి వారికి మద్దతు తెలిపారు. మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా ఆర్‌పీలు కనీస వేతనాలకు నోచుకోక ఇబ్బంది పడుతున్నారని, వారి హక్కుల కోసం పోరాడుతుంటే అడ్డుకోవడం సరికాదన్నారు. తక్షణం వారికి రూ.26వేల కనీస వేతనం అందించాలని, పీఎఫ్, బీమా, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, పని ఒత్తిడి తగ్గించాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సుజాతకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గుగులోతు వీరమ్మ, మిర్యాల లక్ష్మి, నాగమణి, మొగిలి పద్మ, కటారపు మంజుల, స్వరూప, నాగమణి, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రాల్లోని సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. మండలంలో 24 గ్రామ పంచాయతీల్లో 198 వార్డులకు 198 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ తులసీరామ్, గ్రామపంచాయతీ కార్యదర్శి హారిక స్థానికులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలవాలి



మాట్లాతున్న జీఎం సుభానీ

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో కొత్తగూడెం అగ్రస్థానంలో నిలవాలని, నాణ్యతతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలని జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ సయ్యద్ సుభానీ తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం ఏరియాను ఆకస్మికంగా సందర్శించారు. మాట్లాడుతూ.. 2024లో సింగరేణి నిర్దేశించుకున్న ఉత్పత్తిని చేరుకోవటంలో కొత్తగూడెం ఏరియా ముఖ్యపాత్ర పోషించాలని సూచించారు. అనంతరం జీవీఆర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టును సందర్శించారు. నాణ్యత ప్రమాణాల విషయంలో అత్యంత జాగ్రత్త పాటించాలని అధికారులకు, సూపర్‌వైజర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జేవీఆర్‌ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్‌వీఆర్ ప్రహ్లాద్, క్రిష్టారం ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎంవీ నరసింహారావు, డీజీఎం సోమశేఖరరావు పాల్గొన్నారు.

మల్టీ డిపార్ట్‌మెంట్ టీం సభ్యుల సమావేశం

కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకే ఓసీ, ఎంవీటీసీల్లో శుక్రవారం మల్టీ డిపార్ట్‌మెంట్ టీం సభ్యుల సమావేశం జరిగింది. సభ్యులు మాట్లాడుతూ.. బొగ్గు వినియోగం పెరిగినందున నాణ్యతతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలని, సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను రక్షణతో అధిగమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంలు, ఉద్యోగులు, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

సింగరేణిలో భద్రతా పక్షోత్సవాలు



సింగరేణి(కొత్తగూడెం): రక్షణ సూత్రాలను వివరిస్తున్న దృశ్యం



ఇల్లెందు: మాట్లాడుతున్న దామోదర్‌రావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ పరిధిలోని మెయిన్ వర్క్‌షాపులో 55వ రక్షణ వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన రక్షణ తనిఖీ బృందం కన్వీనర్ జీఎం పీజే ఫిజరాల్డ్‌ను వర్క్‌షాపు డీజీఎం రాజీవ్‌కుమార్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ముందుగా రక్షణ పతకాన్ని ఆవిష్కరించి ఉద్యోగులచే రక్షణ ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం శాంతికి ప్రతీకగా పావురాలను ఎగురవేసి, మెయిన్ వర్క్‌షాపు ఆవరణలో మొక్కలను నాటారు. జీఎం మాట్లాడుతూ.. పని ప్రదేశాలలో వ్యక్తిగత రక్షణ చర్యలు తీసుకుంటూ తోటి ఉద్యోగులు కూగా పాటించేలా చూడాలన్నారు. వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా వర్క్‌షాప్‌లో శుక్రవారం 55వ వార్షిక భద్రతా పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. జీఎం ఈఅండ్ఎం కన్వీనర్ ఎస్.దామోదర్‌రావు, ఏరియా ఇంజనీర్ నరసింహారాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు రక్షణ ప్రతిజ్ఞ చేశారు. మాట్లాడుతూ.. కార్మికులు ప్రతీరోజు రక్షణ సూత్రాలు పాటించాలని తెలిపారు. ప్రమాదాలు జరగని వర్క్‌షాపుగా పేర్కొనాలని సూచించారు. అనంతరం 47 లెవల్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పి.అప్పారావు, నరేందర్, మెడికల్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, నాగరాజు, కోదండరామ్, మందగోపాల్, నాగరాజు నాయక్, రామస్వామి, పవన్‌కుమార్, యుగంధర్, మధు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..



మాట్లాడుతున్న రంగయ్య

సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ ఏరియాలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ అడిషనల్ ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య అన్నారు. శుక్రవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని శేషగిరి భవన్‌లో ఏర్పాటు చేసిన యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ విభాగంలో ఫిట్టర్లు, ఎలక్ట్రీషియన్లు, మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు, వాల్వు ఆపరేటర్లు, ఫార్మాసిస్టులు, ఆయాలు, ల్యాబ్ టెక్నీషియన్లు, రేడియాలజిస్టులు, క్లర్కులు, నర్సులు, స్పెషలిస్ట్ డాక్టర్ల కొరత దీర్ఘకాలం ఉన్నప్పటికీ యాజమాన్యం వాటిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. ఆ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని అదేవిధంగా పాతపడిన క్వార్టర్లలో సరైన సౌకర్యాలు, మరమ్మత్తులు లేక కార్మికులు చాలీచాలని అసౌకర్యాల మధ్య జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. యాజమాన్యం స్పందించ కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వంగా వెంకట్, జీ.వీరస్వామి, క్రిష్టాఫర్, రమణమూర్తి, రాము, నాగయ్య, నితిన్, రవీందర్, సుదీర్, మల్లికార్జునరావు, నర్సయ్య, రమేష్, అనంతలక్ష్మి, సరిత, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యం తగదు



నినాదాలు చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల చెల్లింపులో అధికారులు నిర్లక్ష్యం వీడాలని ఏఐటీయూసీ రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య అన్నారు. శుక్రవారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలో జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతీనెల 7వ తేదీలోపు వేతనాల చెల్లింపునకు తగిన చర్యలు తీసుకోకపోవడంతో సివిల్, అకౌంట్స్ అధికారులు బిల్లులు చేయటం లేదని తద్వారా కాంట్రాక్ట్ కార్మికుల బిల్లులు జాప్యం అవుతోందన్నారు. కాంట్రాక్టరు జీతం చెల్లించకపోతే ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా యాజమాన్యమే వేతనాలు చెల్లించి కాంట్రాక్టర్ ద్వారా తీసుకోవాలనే డీవైసీఎల్సీ నిబంధనలు ఉన్నాయని, యాజమాన్యం వాటిని తుంగలో తొక్కి వేతనాలు చెల్లింపులో జాప్యం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కే.నరసింహా, వినోద, అనసూర్య, లక్ష్మి, శాంత, శంకర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వంటగ్యాస్ సేఫ్టీ చెక్ చేయించుకోండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సూపర్‌బజార్ ద్వారా గ్యాస్ పొందే వినియోగదారులు (సింగరేణి కార్మికులు) భారత గ్యాస్ కంపెనీ ఆదేశానుసారంగా ఈనెల 25వ తేదీలోపు తమ గ్యాస్ సిలెండర్ సేఫ్టీ చెక్‌తో పాటు కేవైసీ చేయించుకోవాలని సింగరేణి యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. భద్రతా తనిఖీ చేయటానికి వచ్చిన సూపర్ బజార్ సిబ్బందికి గ్యాస్ బుకింగ్ చేసే ఫోన్ నంబర్ దగ్గర ఉంచుకోవాలని, ఈ తనిఖీ ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు పట్టాను ప్రామాణికం చేయొద్దు



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కౌన్సిలర్ రుక్మాంగధర్



జూలూరుపాడు: బచ్చలకోయగూడెంలో సర్వే

కొత్తగూడెంఅర్బన్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వేలో వారి ఇంటి పట్టాను ప్రామాణికంగా తీసుకోవద్దని కొత్తగూడెం 35వ వార్డు కౌన్సిలర్ రుక్మాంగధర్ బండారి కోరారు. అర్హులైన నిరుపేదలకు క్రమబద్ధీకరించిన పట్టాలు లేనందున ఇంటి ధృవపత్రాల ఆధారంగా ఇళ్లు మంజూరు చేయాలన్నారు. వార్డులో జరుగుతున్న సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు ఇచ్చిన వారికి సొంత స్థలం ఉండి రిజిస్ట్రేషన్ లేకపోవడం, 76 జీఓ ద్వారా దరఖాస్తు చేసుకున్నా పట్టాలు రానందున అధికారులు చొరవ తీసుకొని అర్హులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు స్పెషల్ ఆఫీసర్ హరికృష్ణ, కమిటీ సభ్యులు అడపా నవీన్, రాకేష్, రజిత, రమాదేవి పాల్గొన్నారు. కూలీలైన్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వార్డు కౌన్సిలర్ వై.శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు.

పాల్వంచ: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం చేపడుతున్న ఇందిరమ్మ పక్కా గృహాల మంజూరులో అధికారులు సర్వేను వేగవంతం చేయాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నారాయణను కలిసి ఇందిరమ్మ గృహాలు, కమిటీలపై చర్చించారు. మాట్లాడుతూ.. పేదలకు రూ.5లక్షలు ఇంటి నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. కొండం వెంకన్న, కందుకూరి రాము, వై.వెంకటేశ్వర్లు, ధర్మసోతు ఉపేందర్, నాగేశ్వరరావు, శ్రీలతరెడ్డి, అరుణరెడ్డి, భూక్యా ప్రసాద్, దేవా, శంకర్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. రెండోరోజు శుక్రవారం ఇందిరమ్మ సర్వే బృందాలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇంటింటికి వెళ్లి ఇంటి ఫొటోలు, ఇంటి స్థలాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. జూలూరుపాడు ఎంపీడీఓ కరుణాకర్ రెడ్డి, ఎంపీఓ తులసీరామ్ పడమటనర్సాపురం, మాచినేనిపేటతండా గ్రామ పంచాయతీల్లో పర్యటించి సర్వేను పరిశీలించారు.